క్లుప్తంగా

అలరించిన కర్ణాటక గాత్ర సంగీత కచేరి



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం పద్మావతి కళ్యాణ వేదికపై కర్ణాటక గాత్ర సంగీత కచేరి శనివారం నిర్వహించారు. డాక్టర్ మంగళంపల్లి బాలమురళీకృష్ణ ప్రభుత్వ సంగీత నృత్య పాఠశాల నెల వారీ కార్యక్రమంలో భాగంగా చేపట్టారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. సంగీత విద్వాన్ పోపూరి గౌరీనాథ్(విజయవాడ) పలు వాగ్గేయకార కీర్తనలు ఆలపించారు. వయోలిన్‌పై పెరవలి నందకుమార్, మృదంగంపై కె.సద్గురుచరణ్, ఘటంపై మార్టూరు హరిబాబు వాయిద్యాన్ని అందించారు. ప్రిన్సిపాల్ కేవీఎస్ గోవిందరాజన్ పాల్గొన్నారు.

మంత్రివారివీధిలో సత్యసాయిబాబా భజన



గుంటూరు ఎడ్యుకేషన్: సంగడిగుంట మంత్రి వారివీధిలోని అయ్యప్ప రెసిడెన్సీలో శనివారం భగవాన్ శ్రీసత్యసాయిబాబా భజన కార్యక్రమాన్ని సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు కోవెలమూడి నారాయణరావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి అష్టోత్తరం, హనుమాన్‌చాలీసాతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. సత్సంగమంలో సత్యసాయిబాబా గురించి నరసింహమూర్తి వివరించారు. కార్యక్రమంలో మట్టుపల్లి జగన్మోహనరావు, శివరామకృష్ణ, మహంకాళి శ్రీనివాసరావు, గురునాథం, మద్ది రవికుమార్ పాల్గొన్నారు.

ఐపీఏ ప్రధాన సంపాదకుడిగా డాక్టర్ విద్యాధర్



గుంటూరు రూరల్: ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ (ఐపీఏ)కు ఇటీవల ఎన్నికలు జరిగాయి. ఇండియన్ జర్నల్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్సెస్ ప్రధాన సంపాదకుడిగా చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.విద్యాధర్‌ను ఎన్నుకున్నారు. శనివారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యాధర్ మాట్లాడుతూ.. ఎన్నికల అధికారిగా డాక్టర్ వడ్లమూడి రావు పాల్గొన్నారని తెలిపారు. ఎందరో ప్రముఖులు నిర్వర్తించిన బాధ్యతలను తాను స్వీకరించటం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఐపీఏ అధ్యక్షుడు డాక్టర్ టీవీ నారాయణ పాల్గొన్నారని తెలిపారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, కోశాధికారి ఆర్ గోపాలకృష్ణ, అధ్యాపకులు తదితరులు ప్రిన్సిపల్‌ను అభినందించారు.

ఆవులు బందెలదొడ్డికి తరలింపు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కి తీవ్ర ఆటంకంగా ఉంటున్న ఆవులు, ఎద్దులు, దూడలను వెంగళాయపాలెంలోని జీఎంసీ బందెలదొడ్డికి తరలించారు. శనివారం నగరంలోని మార్కెట్, నల్లచెరువు, లక్ష్మీపురం, లాడ్జి సెంటర్, బృందావన్ గార్డెన్స్ ప్రాంతాల్లో రోడ్ల మీద ట్రాఫిక్‌కి అడ్డుగా ఉన్న ఆవులను జీఎంసీ బందెలదొడ్డికి నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారులు తరలించారు.

ఎముకలు పట్టుతప్పుతున్నాయి..

- ఎండ తగలకపోవటం లోపం
- యువతలో పెరుగుతున్న సమస్య
- నేడు వరల్డ్ ఆస్టియోపోరోసిస్ డే

'గుంటూరు అరండల్‌పేటకు చెందిన శ్రీనివాస్ బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. విధుల్లో భాగంగా నిత్యం ఏసీ గదుల్లో కూర్చుంటారు. ఇటీవల దసరా సెలవులకు సొంత ఊరు వచ్చి బైక్‌పై షాపునకు వెళ్తున్న సమయంలో ప్రమాదానికి గురయ్యాడు. పాతికేళ్లు కూడా నిండకుండానే కొద్దిపాటి ప్రమాదానికే కాలి ఎముక విరిగింది. ఎండ తగలకుండా ఏసీ గదుల్లో అధిక సమయం వెచ్చించడం వలన ఆస్టియో పోరోసిస్‌కు గురైనట్లు నిర్ధారించారు.' ఇలాంటి కేసులు అధికమవుతుండడంపై వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

-గుంటూరు మెడికల్


ఆధునిక జీవనశైలి యువతను ఉక్కిరిబిక్కిరికి గురిచేస్తోంది. చిన్న వయసు వారు కూడా వ్యాధుల బారిన పడుతున్నారు. చిన్న చిన్న దెబ్బలకే ఎముకలు విరిగిపోవడం ఆందోళనకు గురిచేస్తోంది. ఆస్టియోపొరోసిస్ వ్యాధి(బోలు ఎముకల వ్యాధి) సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. ఈ వ్యాధిపై అవగాహన కల్పించేందుకు ఇంటర్‌నేషనల్ ఆస్టియోపొరోసిస్ ఫౌండేషన్(ఐఓఎఫ్) 1996 నుంచి ప్రతి ఏటా అక్టోబర్ 20న వరల్డ్ ఆస్టియోపొరోసిస్ డేను నిర్వహిస్తోంది.

వ్యాధి లక్షణాలు...

వయస్సు పైబడిన వారిలో నడుంనొప్పి, వెన్నుముక ఎదుగలలోపించి ఎత్తు ఆగిపోవటం, వొళ్లంతా నొప్పులు, ఏ పని చేయలేకపోవటం, నీరసం, నిసత్తువ, నిరాశ, ఓపికలేకపోవటం తదితర లక్షణాలు ప్రాథమిక దశలో కనిపిస్తాయి. ఎండ నుంచి శరీరానికి లభించే డి విటమిన్ లభించకపోవటం కూడా వ్యాధి సోకటానికి ఒక కారణం. వ్యాధి లక్షణాలు కన్పించిన వెంటనే అశ్రద్ధ చేయకుండా ఆర్థోపెడిక్ వైద్యుడిని సంప్రదించాలి. అశ్రద్ధ చేస్తే వెన్నుపూస, చేతిమణికట్టు, తుంటి వద్ద ఏ మాత్రం చిన్నదెబ్బ తగిలినా చివరకు ఇంటి గడప కాలికి తగిలినా ఎముకలు విరిగిపోతాయి.

వ్యాధి నిర్ధారణ ఇలా..

కుటుంబంలో ఎవరికైనా ఒకరికి వ్యాధి ఉంటే వారసత్వంగా ఇతరులకు వచ్చే అవకాశం ఉంది. సరైన పోషకాహారం తీసుకోకపోవటం, మద్యపానం, ధూమపానం లాంటి చెడు అలవాట్లు, థైరాయిడ్, లివర్ వ్యాధులు, కొన్ని రకాల మందులు వాడటం ద్వారా ఈ వ్యాధి సోకుతుంది. రోజంతా ఏమాత్రం ఎండలో రాకుండా ఏసీలోనే గంటలతరబడి గడపటంవల్ల ఈ వ్యాధి వస్తుంది. శారీరక వ్యాయామం ఏ మాత్రం చేయనివారికి, ముఖ్యంగా ప్రతిరోజూ కనీసం అరగంటకూడా నడవకపోవటం వల్ల వ్యాధికి గురయ్యే ప్రమాదం ఉంది. రక్త పరీక్షల ద్వారా, ఎక్సరే ద్వారా, ఎముకల సాంద్రత పరీక్షల ద్వారా వ్యాధి సోకిందా లేదా అనే విషయాలు తెలుస్తాయి.



ఆస్టియోపొరోసిస్ డే పోస్టరు

బాధితులు అధికమే...

సాధారణంగా ఆడవాళ్లలో మోనోపాజ్ దశ దాటిన తరువాత 40 ఏళ్లలో, మగవాళ్లలో 50 ఏళ్ల వయస్సులో ఈ వ్యాధి వస్తోంది. ఆధునిక జీవనశైలి వల్ల ప్రస్తుతం 20 శాతం మంది యువత ఆస్టియోమలేషియా వ్యాధి బారిన పడుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా వయోవృద్ధుల్లో 33 శాతం మంది తుంటి ఫ్రాక్చర్ సమస్యలతో బాధపడుతుండగా వారిలో ప్రతిఐదుగురిలో ఒకరు ఫ్రాక్చర్స్‌తోనే మరణిస్తున్నారు. ఆడవారిలో 50 ఏళ్లు దాటిన ప్రతి ముగ్గురిలో ఒకరు, మగవారిలో 12 మందిలో ఒకరు ఈ వ్యాధి బాధపడుతున్నారు. జిల్లాలో 300 మంది ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు ఉన్నారు. ప్రతి రోజూ ఒక్కో వైద్యుడి వద్దకు ఓపీ వైద్య విభాగానికి 50 మందికి పైగా వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో వైద్యులను చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 15 మంది ఆస్టియోపొరోసిస్ బాధితులే. గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ వివిధ రకాల ఆర్థోపెడిక్ సమస్యలతో 200 మంది చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 40 మంది ఈ వ్యాధి బాధితులే.

క్యాల్షియం లెవల్స్ పెంచాలి.....



వ్యాధికి చికిత్సలో భాగంగా శరీరంలో క్యాల్షియం లెవల్స్ పెంచాలి. పాలు, పాల ఉత్పత్తులు తీసుకోవటం ద్వారా క్యాల్షియం పెంచుకోవచ్చు. విటమిన్ డీ కోసం ప్రతిరోజూ కొంత సేపు ఎండలో ఉండాలి. వయస్సు మళ్లిన వారికి విటమిన్, గర్భిణులకు, గర్భసంచి తొలగింపు ఆపరేషన్ చేయించుకున్నవారికి, పీరియడ్స్ రావటం పూర్తిగా ఆగిపోయిన వారికి అదనంగా ప్రతిరోజూ విటమిన్- డి, క్యాల్షియం మాత్రలు ఇవ్వాలి. పోషకాహారాన్ని అందించాలి. పొగతాగటం, మద్యం తాగడం లాంటి చెడు అలవాట్లు విడనాడాలి. ప్రతిరోజూ తప్పనిసరిగా అరగంటసేపైనా నడవాలి.

–డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, సీనియర్ జాయింట్ రీప్లేస్‌మెంట్ సర్జన్, గుంటూరు

వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి



ప్రతిరోజూ ఆస్టియో పొరాసిస్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఓపీకి వచ్చే వారిలో 25 శాతం మంది ఆస్టియో పొరాసిస్ బాధితులే. యువకులు కూడా ఈ వ్యాధిబారిన పడడం ఆందోళకరమైన అంశం. కొన్ని సార్లు వైద్య పరీక్షల్లో రిపోర్టులు నార్మల్‌గా ఉన్నా నొప్పులు ఉంటాయి. నొప్పులు ఉంటే వ్యాధిగా గుర్తించి చికిత్స చేయించుకోవాలి. ఈ వ్యాధి వల్ల వెన్నముక కూడా బోలుగా మారిపోయి కొద్దిపాటి దెబ్బలకే విరిగిపోయి జీవితం చాలా దుర్భరంగా మారుతుంది. కీళ్లవాతం, కిడ్నీ వ్యాధులు, థైరాయిడ్ సమస్యలు ఉన్నవారికి ఆస్టియోపొరోసిస్ వ్యాధి వచ్చే అవకాశం ఉంది. కాబట్టి వీరికి ముందస్తుగా పరీక్షలు చేయించాలి.

– డాక్టర్ జి.నరేష్‌బాబు, సీనియర్ స్పుయిన్ సర్జన్, గుంటూరు

సమస్యలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలి

కమిషనర్ శ్రీనివాసులు



నెహ్రూనగర్: నగరపాలకసంస్థ పరిధిలోని వార్డు సచివాలయ కార్యదర్శులు తమ సచివాలయం పరిధిలో సమస్యలు, పరిష్కార మార్గాలపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలని, కార్యదర్శులు స్థానికంగా ఉండే సమస్యలను పరిష్కారానికి చొరవ చూపాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. శనివారం కమిషనర్ ఎన్‌జీఓ కాలనీ, నల్లకుంట, శ్యామల నగర్, పలకలూరు రోడ్, ఉద్యోగ నగర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్యం, అభివృద్ధి పనులను ఇంజినీరింగ్, పట్టణ ప్రణాళిక, ప్రజారోగ్య అధికారులతో కలసి పరిశీలించారు. తొలుత ఎన్‌జీఓ కాలనీ మున్సిపల్ స్కూల్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, డ్రెయిన్లను పరిశీలించి సంబంధిత సచివాలయ శానిటేషన్, ఎమినిటీ కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానికంగా ఉండే సమస్యలను పరిష్కరించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజారోగ్య కార్మికులు ప్రతి రోజు ఉదయం ఇంటింటి చెత్త సేకరణ చేస్తారని, వారితో సచివాలయం పరిధిలో సమస్యాత్మక ప్రాంతాల్లో గ్యాంగ్ వర్క్ ద్వారా కాల్వలు శుభ్రం చేయించడంలో కార్యదర్శులు తీవ్ర నిర్లక్ష్యంగా ఉంటున్నారని, అటువంటి వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. పర్యటనలో ఎస్‌ఈ నాగ మల్లేశ్వరరావు, ఈఈ సుందర్రామిరెడ్డి, కార్పొరేటర్ వి.శ్రీరామ్ ప్రసాద్, డీఈఈలు మధుసూదన్, నాగభూషణం, ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎంహెచ్‌ఓ ఆనందకుమార్, టీపీఎస్ లక్ష్మణ స్వామి, ఏఈలు నాగవేణి, చైతన్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.

మంచు తెరలు



మంచుతో కమ్ముకున్న కాకాని రోడ్డు



మంచుతో కమ్ముకున్న నెహ్రూనగర్ గేటు రోడ్డు

వాతావరణంలో మార్పులు నగరంపై పడ్డాయి. శనివారం మధ్యాహ్నం భారీ వర్షం నగరాన్ని ముంచింది. సాయంత్రానికి మంచుదుప్పటి పరిచింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు

బ్యాంకు రుణాలు అందేలా చూడాలి

నెహ్రూనగర్: అర్హులైన స్వయం సహాయక సంఘాల సభ్యులకు మెప్మా రీసోర్స్ పర్సన్స్(ఆర్‌పీలు) బ్యాంకుల నుంచి రుణాలు అందేలా చిత్తశుద్ధితో పని చేయాలని తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కోరారు. నియోజకవర్గంలోని ఆర్‌పీలు, సీఎంఎంలు, సీఓలతో ప్రత్యేక సమావేశం శనివారం నిర్వహించారు. తొలుత నియోజకవర్గ పరిధిలో ఎంత మంది స్వయం సహాయక గ్రూప్‌లు, సభ్యులు, ఇప్పటి వరకు అందిన రుణాలు, రీ పేమెంట్, అందించిన బ్యాంక్‌లు, మెప్మా సిబ్బంది తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. సభ్యులకు అందాల్సిన రుణాలను బ్యాంకర్ల ద్వారా ఇప్పించడంలో ఆర్‌పీలు కీలకంగా పనిచేయాలని కోరారు. సమావేశంలో మెప్మా పీడీ(ఎఫ్‌ఏసీ) విజయలక్ష్మి, జీఎంసీ డెప్యూటీ కమిషనర్ డి.శ్రీనివాసరావు, ఎల్‌డీఎం రత్నమహిపాల్ రెడ్డి, ఉపా సెల్ పీఓ బాలాజీబాషా పాల్గొన్నారు.

ఎర్ర చెరువును కాపాడుకుంటాం

రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి

నెహ్రూ నగర్: గుంటూరు నగర నడిబొడ్డులోని ఎర్రచెరువును ఎన్ని ఇబ్బందులు వచ్చినా కాపాడుకుంటామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. గుంటూరు టౌన్ రజక జనసేవా సంఘం ఆధ్వర్యంలో ఎర్ర చెరువును కాపాడుకుందాం అనే నినాదంతో శనివారం పాత గుంటూరులోని గంగానమ్మ గుడిలో బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రజక సంఘంలోని లోటుపాట్లను ఆసరాగా చేసుకొని కొంతమంది ఎర్ర చెరువును కబ్జా చేసేందుకు కుయుక్తులు పన్నుతున్నారని పేర్కొన్నారు.



మాట్లాడుతున్న జూపూడి శ్రీనివాసరావు

కబ్జాదారులు ఎన్ని కుయుక్తులు పన్నిన రజకులంతా ఏకతాటిపై నిలబడి ఎర్ర చెరువును కాపాడుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఉమామహేశ్వరరావు, ఆంజనేయులు, వీరాస్వామి, గణేష్, సురేష్, రాము, కృష్ణ, సాంబయ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫెన్సింగ్ క్రీడా పోటీలు

పెదకాకాని: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కాకినాడ జేఎన్‌టీయూ అంతర్ కళాశాలల టోర్నమెంట్ సెక్రటరీ డాక్టర్ జీపీ రాజు అన్నారు. పెదకాకాని మండలంలోని నంబూరు వీవీఐటీ కళాశాలలో కాకినాడ జేఎన్‌టీయూ సెంట్రల్ జోన్ అంతర్ కళాశాలల క్రీడా పోటీలలో భాగంగా ఫెన్సింగ్ పోటీలు నిర్వహించారు. డాక్టర్ జీపీ రాజు ప్రారంభించారు. మూడు విభాగాలలో మహిళలు, పురుషులకు నిర్వహించిన ఈ పోటీలలో 16 కళాశాలల నుంచి 32 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పురుషుల విభాగంలో ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థి ఎం.వెంకటేష్, కిట్స్ కళాశాలకు చెందిన పి.సృజన్ సిన్హా, మహిళల విభాగంలో చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన కె.రత్నకుమారి ప్రతిభ చాటి ప్రథమ విజేతలుగా నిలిచారు. వీరితోపాటు ఇతర విజేతలకు సర్టిఫికెట్, షీల్డ్ బహూకరించారు. విజేతలను వీవీఐటీ అకడమిక్ డీన్ డాక్టర్ కె.గిరిబాబు, ఈవెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఎన్.అరుణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్స్ ఎస్.సొరయ్య, డాక్టర్ ఎం.గిరిధర్ అభినందించారు.



విజేతలను అభినందిస్తున్న డాక్టర్ జీపీ రాజు

గాయని గాయకులకు స్టాలిన్‌బాబు మార్గదర్శి

నగరంపాలెం: ఘంటసాల గీతాలాపనలో రాష్ట్ర స్థాయిలో స్టాలిన్‌బాబు తనదైన ముద్రవేశారని పలువురు వక్తలు కొనియాడారు. గుంటూరు గాన కళాకారుల సినీ సంగీత విభావరి పర్యవేక్షణ కమిటీ ఆధ్వర్యంలో మధుర గాయకుడు సిహెచ్.స్టాలిన్‌బాబు సంతాప సభ శనివారం అమరావతిరోడ్డులోని అన్నదాన సమాజము ఆడిటోరియంలో నిర్వహించారు. సభకు కమిటీ అధ్యక్షుడు మిరియాల ప్రసాదరావు అధ్యక్షత వహించారు. అఖిల భారత పంచాయతీ పరిషత్(న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షులు డాక్టర్ జాస్తి వీరాంజనేయులు, గాదె రత్నారెడ్డి, పెళ్ళూరి కృష్ణారావు, కె.బాబూరావు, శ్యామల కోటిరెడ్డి, న్యాయ సలహాదారు టి.దేవదాసు, విశ్రాంత ఏఓ వెంకాయమ్మ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

24న మెగా జాబ్‌మేళా

గుంటూరు ఎడ్యుకేషన్: మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఈనెల 24న సమర్థనం ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి.మల్లికార్జునప్రసాద్ తెలిపారు. శనివారం హిందూ కళాశాలలో జాబ్‌మేళా పోస్టర్లు విడుదల చేశారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ ప్రసాద్ మాట్లాడుతూ 30 ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్న జాబ్‌మేళాలో టెన్త్, ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్హతలు కలిగిన 18 నుంచి 35 ఏళ్ల లోపు వయసు గల నిరుద్యోగ యువత హాజరు కావాలని సూచించారు. వివరాలకు 63648 67800 నంబర్లో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కేవీఎస్ దుర్గాప్రసాద్, సమర్థనం ట్రస్ట్ ఏపీ చాప్టర్ హెడ్ ఎంఆర్‌కే పరమహంస, బి.రంగారావు పాల్గొన్నారు.

నగరంలో భారీ వర్షం



పూర్తిగా నీట మునిగిన నగరపాలక సంస్థ కార్యాలయం



గాంధీ పార్కు కాంపౌండ్ వాల్ వద్ద డ్రెయిన్‌లోకి కొట్టుకుపోయిన కార్లు



నల్లకుంట అర్బన్ హెల్త్ సెంటర్ ప్రాంగణంలో వర్షం నీరు

- నీట మునిగిన పలు లోతట్టు ప్రాంతాలు
- నీటిలోనే అర్బన్ హెల్త్ సెంటర్
- వర్షపు దాటికి కొట్టుకుపోయిన వాహనాలు

నెహ్రూనగర్: గుంటూరు శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో లోతట్టు ప్రాంతాలన్ని జలమయం అయ్యాయి. ముఖ్యంగా మూడు వంతెనలు, ఉమెన్స్ కాలేజీ రోడ్డు, ఐటీసీ సెంటర్, గాంధీ పార్కు పరిసర ప్రాంతం, నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయం కూడా నీటిలో మునిగింది. భారీ వర్షం దాటికి చిరు వ్యాపారులు, వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గుంటూరు నగరంలోని ప్రధాన కూడళ్లు అయిన బ్రాడీపేట, అరండల్‌పేట, కొరిటెపాడు, ఉమెన్స్ కాలేజీ సెంటర్ అంతా కూడా వర్షపు నీటితో మునిగిపోయింది.

కొట్టుకుపోయిన కార్లు

నగరపాలక సంస్థ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ పార్కు కాంపౌండ్ వాల్ వద్ద రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు భారీ వర్షం దాటికి సైడు డ్రెయిన్‌లోకి కొట్టుకుపోయాయి. దీంతో వాహనదారులు అటువైపు వెళ్లడానికి కొంత భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. శనివారం కురిసిన భారీ వర్షానికి నల్లకుంటలోని అర్బన్ హెల్త్ సెంటర్ నీట మునిగింది. ఆస్పత్రి కాంపౌండ్ అంతా కూడా మోకాళ్ల లోతు నీరు చేరింది. హెల్త్ సెంటర్‌లో నీరు చేరింది.

గ్రాడ్యుయేషన్ ఓటర్ల నమోదు పారదర్శకంగా నిర్వహించాలి

డీఆర్వోకు ఎమ్మెల్సీ లక్ష్మణరావు వినతిపత్రం

గుంటూరు వెస్ట్: కృష్ణా–గుంటూరు నియోజకవర్గాల పట్టభద్రుల ఓటర్ల నమోదు ప్రక్రియను నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, డీఆర్వో పెద్ది రోజాకు వినతిపత్రం అందజేశారు. స్థానిక కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌ను శనివారం పుష్పగుచ్ఛం అందించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఓటర్ల నమోదు ప్రక్రియలో కొన్ని సమస్యలు ఎదురవుతున్నాయని, వాటిని పరిష్కరించాలన్నారు. డీఆర్వో మాట్లాడుతూ ఆఫ్‌లైన్ ఫారం స్థానిక తహసీల్దార్‌కు ఇవ్వాలన్నారు. ఆయన వెంట యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ ఉన్నారు.

చిరువ్యాపారులే టార్గెట్

- గుజ్జనగుండ్లలో ఆకస్మాత్తుగా పొక్లెయిన్‌తో దుకాణాల తొలగింపు
- బాధితులు ఇచ్చిన సమాచారంతో గుజ్జనగుండ్ల వెళ్లిన మేయర్ కావటి మనోహర్‌నాయుడు
- చిరువ్యాపారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశం

నెహ్రూనగర్: గుంటూర నగరపాలక సంస్థ పరిధిలో చిరు వ్యాపారులే టార్గెట్‌గా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు వారి దుకాణాలను ధ్వంసం చేస్తూ వారి జీవనోపాధికి గండికొడుతున్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఏళ్ల తరబడి దుకాణాలను నిర్వహించుకుంటున్న తమను అర్ధాంతరంగా ఖాళీ చేయించాలని చూడటం కరెక్ట్ కాదని చిరువ్యాపారులు వాపోతున్నారు. ఇదే పరిస్థితి గుజ్జనగుండ్లలో జరిగింది. శనివారం ఉదయం పట్టణ ప్రణాళిక అధికారులు పొక్లెయిన్ సాయంతో ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా దుకాణాలను కూల్చే ప్రయత్నాలు చేశారు. ఇందులో రెండు, మూడు దుకాణాలను కూడా తొలగించారు. అయితే బాధితులు విషయాన్ని మేయర్ కావటి మనోహర్‌నాయుడి దృష్టికి తీసుకువెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో గుజ్జనగుండ్ల చేరుకున్న మేయర్ అధికారులతో మాట్లాడారు.



పట్టణ ప్రణాళిక అధికారులతో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్‌నాయుడు

ముందస్తు సమాచారం లేకుండా ఏ విధంగా తొలగిస్తారు: మేయర్

నగరంలో చాలా చోట్ల రోడ్ల వెంబడి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా జీవనోపాధి పొందుతున్న చిరువ్యాపారులపై పట్టణ ప్రణాళిక అధికారులు ముందస్తు సమాచారం లేకుండా పొక్లెయిన్ సాయంతో షాపులను తొలగించడం సమంజసం కాదని అధికారులకు మేయర్ సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందిగా ఉండే వాటిని తొలగించాలన్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా చిరువ్యాపారం చేసుకుంటున్న చిన్న చితక బడుగు జీవుల దుకాణాలను తొలగించే ప్రయత్నాలు మానుకోవాలని అధికారులకు సూచించారు. మీకు అంతగా ఇబ్బందిగా ఉంటే ముందస్తుగా సమస్యను వారి దృష్టికి తీసుకువెళ్లిన తరువాతే మాత్రమే తొలగించాలన్నారు. ఆ విధంగా కాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే సహించేది లేదని పట్టణ ప్రణాళిక అధికారులను హెచ్చరించారు.

క్రెడిట్ లిమిట్ పెంచుతానని మోసం

లక్ష్మీపురం: క్రెడిట్ లిమిట్ అంటూ మోసంపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాలు.. ముత్యాలరెడ్డినగర్‌కు చెందిన దార్ల రంజిత్‌కుమార్, విద్యుత్ కాంట్రాక్ట్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. ఇటీవల కాలంలో రంజిత్‌కుమార్ బ్యాంక్ లావాదేవీలు సక్రమంగా ఉండటంతో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారు క్రెడిట్ కార్డు మంజూరు చేశారు. అయితే క్రెడిట్ కార్డు ఇటీవల పలు రకాల పనులకు వినియోగిస్తు వచ్చాడు. అయితే క్రెడిట్ లిమిట్ పెంచేందుకు బ్యాంక్ ఖాతాను ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్న సమయంలో ఒక నంబర్ నుంచి ఫోన్ కాల్ వచ్చింది. ఖాతాలో క్రెడిట్ లిమిట్ పెంచేందుకు పరిశీలిస్తున్నారా అని అడిగి ఖాతా వివరాలు తెలియజేయాల్సిందిగా చెప్పడంతో నమ్మిన రంజిత్‌కుమార్ ఎస్‌బీఐ క్రెడిట్ కార్డు విభాగం నుంచి ఫోన్ వచ్చిందని, ఖాతా వివరాలు, ఓటీపీలు చెప్పడంతో క్రెడిట్ కార్డులో ఉన్న రూ.91,215 వేలు ఒక్కసారిగా మాయం అయ్యాయి. ఇదేంటి అని పరిశీలించి వచ్చిన ఫోన్ కాల్‌కు తిరిగి ప్రయత్నించగా ఫోన్ పని చేయలేదు. దీంతో బాధితుడు దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.